జలం.. గరళం

- వాటర్ గ్రిడ్ ద్వారా కలుషిత తాగునీరు సరఫరా
- కుళాయి వద్దకెళ్తే ఆకుపచ్చ రంగు నీళ్లే గతి
- 15 గ్రామాల ప్రజల ఆందోళన



ఆకుపచ్చ రంగులో ఉన్న నీళ్లు



కుళాయిల్లో చెరువునీరు వస్తుందని వాపోతున్న మహిళలు, (ఇన్‌సెట్లో) బకెట్లలో కలుషితనీరు

నక్కపల్లి: ప్రజల దాహార్తిని తీర్చే అమృత జలం కాస్తా మురుగు నిండిపోయి గరళమవుతోంది. వ్యర్థాలతో కలుషితమై సంకటంగా పరిణమిస్తోంది. మండలంలో కోట్లాది రూపాయలు వెచ్చించి పలు గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కరించేందుకు నిర్మించిన ఉద్దండపురం వాటర్ గ్రిడ్ ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోంది. బిందెలు పట్టుకుని కుళాయిల వద్దకు వెళ్తే చెరువులో నాచుపట్టి నిల్వ ఉన్న విధంగా పచ్చ, ఎరుపు రంగులో నీళ్లు వస్తున్నాయంటూ మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీరు తాగితే ఎక్కడ అనారోగ్యం బారిన పడాల్సి వస్తుందోనంటూ ఆవేదన చెందుతున్నారు.

పాయకరావుపేట నియోజవర్గంలో 97 గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు 2009లో అప్పటి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అభ్యర్థన మేరకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.36 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో నాతవరం నుంచి ఏలేరు కాలువ నీటిని పైపుల ద్వారా తరలించి ఉద్దండపురం వద్ద స్టోరేజీ ట్యాంకులు నిర్మించి నీటిని నిల్వ చేసి అక్కడ ఆధునిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ఫిల్టర్ల ద్వారా శుద్ధి చేసి పైపులైన్ల ద్వారా గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. వైఎస్సార్ హయాంలో మంజూరైన నిధులతో నాతవరం నుంచి ఉద్దండపురం వరకు పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఏలేరు కాలువ నీటిని పాయకరావుపేట నియోజకవర్గ తాగునీటి అవసరాల కోసం వినియోగించేందుకు అనుమతులు మంజూరు చేశారు. స్టోరేజీ ట్యాంకులు నిర్మించారు.

వైఎస్సార్ మరణంతో మొదలైన కష్టాలు...

వైఎస్సార్ మరణానంతరం 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం మరో రూ.50 కోట్లు మంజూరు చేసి నీటిని శుద్ధి చేసే ట్యాంకులు, అదనంగా ట్యాంకులు, కొన్ని గ్రామాల్లోకి పైపులైన్లు ఏర్పాటు చేసింది. వాటర్ గ్రిడ్‌ను మాత్రం పూర్తి చేయలేదు. దీంతో అక్కడ రూ.86 కోట్లతో చేపట్టిన పనుల ద్వారా ఉద్దండపురం, గొడిచర్ల, చినదొడ్డిగల్లు, వేంపాడు, నెల్లిపూడి, కాగిత, గునిపూడి, గుల్లిపాడు తదితర గ్రామాలకు తాత్కాలికంగా నీటిని సరఫరా చేస్తున్నారు. పైపులైన్ల ద్వారా గ్రామాల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులకు సరఫరా చేసి అక్కడ నుంచి కుళాయిల ద్వారా తాగునీటి అందిస్తున్నారు. గడచిన 15 రోజుల నుంచి ఇలా సరఫరా అయ్యే నీళ్లు పూర్తిగా రంగుమారి కలుషితమయ్యాయి. కుళాయిల వద్దకు బిందెలు పట్టుకుని వెళ్తే, ఆకుపచ్చగా, ఎరుపురంగు మాదిరిగా చెరువులో ఉండే విధంగా నీళ్లు వస్తున్నాయంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శుద్ధి చేయకపోవడంతో కలుషిత నీరు..

వాటర్ గ్రిడ్ వద్ద నిల్వ చేసిన నీటిని అక్కడ శుద్ధి చేయకుండా నేరుగా విడుదల చేయడం వల్లే కలుషితమైన తాగునీరు విడుదలవుతోందంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు గతంలో స్టోరేజీ ట్యాంకుల్లోకి ఏలేరు కాలువ నీరు విడుదల కాలేదని, దీంతో ట్యాంకులు ఎండిపోయి గడ్డి మొలిచిందని చెబుతున్నారు. తర్వాత ఏలేరు కాలువ నీరు విడుదల కావడంతో పిచ్చిమొక్కలు తొలగించకుండా స్టోరేజీ ట్యాంకుల్లో చేరిన నీటిని యధావిధిగా విడుదల చేయడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందంటూ ఆరోపిస్తున్నారు. ఇలాంటి నీళ్లు తాగినా వంట కోసం వినియోగించినా ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటర్ గ్రిడ్‌పై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాటర్ గ్రిడ్‌ను పూర్తి చేయకపోవడం వల్ల 97 గ్రామాలకు అందాల్సిన తాగునీరు ప్రస్తుతం 15 గ్రామాలకే పరిమితమైంది. అది కూడా కలుషిత నీరు విడుదలవుతోందని ఆయా గ్రామాల వారు చెబుతున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

సోలార్ విద్యుత్‌తో ఆదా



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: సోలార్ వినియోగంతో విద్యుత్ ఆదా, ఆదాయం పొందవచ్చని కొరుప్రోలు ఏఈ బి. గోపి తెలిపారు. దార్లపూడి గ్రామంలో సోలార్ విద్యుత్ ఏర్పాటు, దాని ఉపయోగం, లాభాలుపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ కోనకోట నీలేంద్రరావు, పోలిశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



అయ్యప్పస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో శుక్రవారం అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా హాజరయ్యారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు.

పాలిసెట్‌లో రాణించాలి



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

మునగపాక: పాలిసెట్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంఈవో–2 బుద్ధ శివనాయుడు కోరారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్, అనకాపల్లి షిర్డీ సాయి లా కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పాలిసెట్ శిక్షణలో భాగంగా నిర్వహించిన నమూనా పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను శుక్రవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏకాగ్రతతో చదువుకోవాలన్నారు. పోటీ పరీక్షల్లో రాణించాలంటే ఇష్టపడి, కష్టపడి చదువుకోవడం తప్పనిసరిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మాడెం జోగారావు, ఎం.సత్యనారాయణమూర్తి, కసిరెడ్డి బాల సంజీవరావు, సతీష్‌కుమార్, రామచంద్రరావు, అచ్యుతకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చండి



విద్యార్థుల తల్లిదండ్రులకు కరపత్రాలు ఇస్తున్న ఉపాధ్యాయులు

కోటవురట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని వారి తల్లిదండ్రులను ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఇందులో భాగంగా స్కూల్ కమిటీ చైర్మన్ యలమంచిలి శ్రీనివాసు ఆధ్వర్యంలో కొడవటిపూడి ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయులు గురువారం రాత్రి విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న సదుపాయాలు, నాణ్యమైన విద్య గురించి వివరించారు. పైసా ఖర్చు లేకుండా మీ పిల్లలకు బంగారు భవిష్యత్‌ను ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.ప్రతాప్, లోవరాజు, శంకరరావు, రమణాజీ పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ విభాగం క్షేత్ర స్థాయి కార్యకర్త రమ్య

మునగపాక: బాలల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు బాల్య వివాహాలను అరికట్టేలా చూడాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం క్షేత్ర స్థాయి కార్యకర్త రమ్య కోరారు. తిమ్మరాజుపేటలో జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంయుక్త నిర్వహణలో శుక్రవారం బాలల సంరక్షణ కమిటీ సభ్యులు ఎంపిక చేపట్టారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించడంతో పాటు బాలికలపై లైంగిక దాడులను అరికట్టేలా చూడాలన్నారు. సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రమణరావు, వీఆర్వో రమేష్, పెద్దలు సూరిశెట్టి రాము, జగన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మలేరియా సోకకుండా తగు జాగ్రత్తలు



మునగపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



సర్వసిద్ధి పీహెచ్‌సీ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



వారపు సంతలో వ్యాపారులకు మలేరియా అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



పాయకరావుపేటలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

మునగపాక: ప్రతి ఒక్కరూ మలేరియా సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి కోరారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మునగపాకలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్యం సంభవించినా వైద్యులను సంప్రదించాలన్నారు. సీహెచ్‌వో దేవకాంత, సూపర్‌వైజర్లు ఎం.నాగేశ్వరరావు, సీతా మహలక్ష్మి, వైద్య సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: దోమలు వ్యాప్తి తగ్గించుకుని మలేరియా వ్యాధికి దూరం కావాలని సర్వసిద్ధి వైద్యాధికారి ఎన్ వాసంతి సూచించారు. జాతీయ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఇళ్లలో వాడుక నీరు ఎక్కువగా నిల్వ ఉంటే లార్వా వృద్ధి చెంది దోమలు పెరుగుతాయన్నారు. ఇవి వ్యాధి కారకమవుతాయన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నాగేశ్వరరావు, పీహెచ్ఎన్ ఎం.రత్నసఖి, హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాష్ పాల్గొన్నారు.

పాము కాటు కన్నా దోమకాటు ప్రమాదం

అచ్యుతాపురం రూరల్: పాము కాటు కన్నా దోమ కాటు ప్రమాదమని వైద్యాధికారి శ్రావ్య అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రావ్య, లిఖితల ఆధ్వర్యంలో స్థానిక పుర వీధుల్లో వారపు సంతలో దోమ కాటు వల్ల కలిగే మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచి నీటి నిల్వలు ఫ్రిజ్ వెనుక భాగం గిన్నెలో, డ్రమ్ముల్లో ఉత్పన్నమైన ఎనాఫిలిస్ (ఆడదోమ) కారణంగా మలేరియా వ్యాధి ప్రబలుతుందన్నారు. తీవ్ర జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, విరేచనాలు, ఆయాసం వంటి అనేక అనారోగ్య సమస్యలు సంభవిస్తాయన్నారు. ఇటువంటి లక్షణాలు శరీరంలో కనిపించినప్పుడు వెంటనే స్థానిక పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్య సిబ్బంది సన్యాశిరావు, వరలక్ష్మి, లండా అప్పలకొండ, సరోజిని, వేణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాయకరావుపేట: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహించారు. మెయిన్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడే పాటించాలని వైద్యులు సుభాష్, ఎస్.సౌందర్య తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఈవో పీవీ రమణ, హెచ్ఎస్ ఎం.నాగేశ్వరరావు, హెచ్‌వీకే వజ్రం, ఏఎస్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యలమంచిలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరిస్తే యలమంచిలి నియోజకవర్గాన్ని అమెరికా స్థాయికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే సుందరపు జయకుమార్ పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు పదవులకు వన్నె తీసుకురావాలన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించాలన్నారు. స్థానిక మండల పరిషత్ హాలులో శుక్రవారం ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఎన్నికల వరకే రాజకీయాలు చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి పాటుపడాలన్నారు. కార్పొరేషన్ రుణాల మంజూరులో రాజకీయాలకు తావులేకుండా చూడాలన్నారు. మునగపాక మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ఎవరైనా ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణలకు పాల్పడినా చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో భాగంగా పలువురు అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతిని చదివి వినిపించారు.

జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీడీవో ఎం.ఉషారాణి, తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, ఈవోపీఆర్డీ సోమరాజు, వైస్ ఎంపీపీ బోజా లక్ష్మీ, సర్పంచ్‌ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కాండ్రేగుల నూకరాజు, సుందరపు తాతాజీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

పేద విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులు



కుంచం నరేష్

నక్కపల్లి: రాబోయే విద్యా సంవత్సరంలో ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థుల ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి కుంచం నరేష్ శుక్రవారం తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసీ విద్యార్థులకు స్టేట్, సీబీఎస్ఈ సిలబస్‌లు కలిగిన ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తోందన్నారు. ఇటువంటి పాఠశాలల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మండల విద్యా శాఖ చేపట్టిందన్నారు. ప్రతి పాఠశాల ప్రభుత్వ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా రిజిస్టర్ కావాలన్నారు. దీనికి ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు గడువు ఇచ్చామన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలు పొందగోరు విద్యార్థులు ఈ నెల 28 నుంచి మే 15వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మే 16 నుంచి 20వ తేదీ వరకు విద్యార్థుల అర్హత నిర్ధారిస్తామన్నారు. మే 31న లాటరీ ద్వారా మొదటి విడత జాబితాను ఎంపిక చేస్తామన్నారు. జూన్ 2న మొదటి విడతలో ఎంపికయిన విద్యార్థులు ఆయా పాఠశాలల్లో చేరాల్సి ఉంటుందన్నారు. మొదటి విడతలో అడ్మిషన్లను పరిశీలించి అప్పటివరకు మిగిలి ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు మరో సారి లాటరీ తీసి ఎంపికయిన వారికి జూన్ 6న ప్రవేశం కల్పిస్తామన్నారు.

గంధం అమావాస్యకు ఏర్పాట్లు



ముస్తాబయిన నూకాంబిక ఆలయం



పేటసూధిపురం నూకాంబిక

ఎస్.రాయవరం: మండలంలోని మూడు గ్రామాల్లో ఆదివారం నిర్వహించే గంధం అమావాస్య జాతరకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఎస్.రాయవరం, కొరుప్రోలు, పేటసూధిపురం గ్రామాల్లో ఏటా గంధం అమావాస్య రోజున అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో విద్యుత్ దీపాలంకరణలు, రంగు రంగులతో ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. శనివారం రాత్రి నుంచి ప్రారంభమయ్యే జాతరలో ఆదివారం ఉదయం నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకోనున్నారు. అమ్మవారి జాగరం పేరిట పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్యుతాపురం, పూడిమడక రోడ్, కోనేంపాలెం, కుమారపురం, దుప్పితూరు గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకూ సరఫరా ఉండబోదన్నారు.

యలమంచిలి రూరల్: పట్టణంలో చేపట్టనున్న విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా శనివారం కొన్ని ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డివిజన్ ఈఈ కే రాజశేఖర్ తెలిపారు. పట్టణంలో మిలట్రీ కాలనీ, కొత్తపేట, యానాద్రి కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు, మెయిన్‌రోడ్, ద్వారకానగర్, నెహ్రూ నగర్, గాంధీనగర్, ఎర్రవరం, కొత్త ఎర్రవరం, లైను కొత్తూరు, సోమన్నపాలెం గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించి ముందస్తు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

శ్మశానవాటికలను ఆక్రమిస్తే చర్యలు



నాగులాపల్లి శ్మశాన వాటిక ఆక్రమణలను గుర్తిస్తున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: శ్మశాన వాటికలను ఆక్రమిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని నాగులాపల్లిలో ఆక్రమణకు గురైన శ్మశానవాటికను శుక్రవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానంగా శ్మశానవాటికలను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేస్తున్నామన్నారు.

సమష్టి కృషితో వైఎస్సార్‌సీపీ పునర్వైభవం



గుడివాడను మర్యాదపూర్వకంగా కలిసిన పరవాడ వైఎస్సార్‌సీపీ నేతలు

పరవాడ: పార్టీలో నాయకులు అందరు కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ నూతన అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ సూచించారు. పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన గుడివాడను పరవాడ ప్రాంత వైఎస్సార్‌సీపీ నేతలు మిందిలోని ఆయన స్వగృహంలో శుక్రవారం కలిసి దుశ్శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు అనుసరిస్తున్న అరాచక పాలనను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరిని పార్టీలో గుర్తింపు దక్కుతుందన్నారు. పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు మాట్లాడుతూ అమర్‌నాథ్ నియామకంతో పార్టీకి జిల్లాలో పూర్వవైభవం వస్తుందన్నారు. గుడివాడను కలిసిన వారిలో మండల వైస్ ఎంపీపీ బందం నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, భర్నికం సర్పంచ్ పెదిశెట్టి పూజాశేఖర్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ మాజీ డైరెక్టర్ దలాయి నదియా, కన్నూరు సర్పంచ్ గొల్లవిల్లి శ్రీను కృష్ణవేణి ఉన్నారు.

ఉగ్రదాడిలో మృతులకు నివాళి



అడ్డురోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని జనసేన పార్టీ నాయకుడు శివదత్తు, గ్రంథాలయ మాజీ చైర్మన్ తోట నగేష్ అన్నారు. అడ్డురోడ్డు కూడలిలో మృతుల చిత్రపటాలకు పుష్పాలు వేసి నివాళులర్పించారు. అనంతరం అడ్డురోడ్డులో ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదులను తరిమికొట్టాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బాబూరావు, దమ్ము రాజు, చందు పాల్గొన్నారు.

ఉక్కు రంగాన్ని స్ట్రాటజిక్ రంగంలోకి మార్చాలి

ఉక్కునగరం: ఉక్కు రంగాన్ని నాన్ స్ట్రాటజిక్ నుంచి స్ట్రాటజిక్ రంగంలోకి మార్చాలని నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎన్‌సీవోఏ) తీర్మానించిందని విశాఖ స్టీల్‌ప్లాంట్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కేవీడీ ప్రసాద్ తెలిపారు. మనాలిలో జరిగిన ఎన్‌సీవోఏ నేషనల్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కేవీడీ ప్రసాద్‌లతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన పలు అధికారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సెయిల్, విశాఖ స్టీల్‌ప్లాంట్, నగర్‌నార్ ప్లాంట్, డిజైన్ సంస్థ మెకాన్, మైనింగ్ సంస్థ కేఐవోసీఎల్‌లను విలీనం చేసి ఒకే గొడుగు కిందకు తీసుకు రావాలని తీర్మానించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెంచినట్లే పీఎస్‌యూ ఉద్యోగులకు గ్రాట్యుటీ రూ. 25 లక్షలకు పెంచాలని, సమర్థులైన చైర్మన్లు, డైరెక్టర్లను సత్వరమే నియమించాలని తీర్మానాలు చేశారు.